

- పింఛన్ మొత్తం పెంపుతో డిమాండ్
- క్యాష్ చేసుకుంటున్న వైనం
- ధరలు పెట్టి శిబిరాల్లో వసూలు

స'ధర'ం ర్టిఫికెట్!



చేయి తడుపు.. సదరం సర్టిఫికెట్ పట్టు..





హిందూపురం, జూలై 18: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్ మొత్తం పెంచడంతోపాటు కొంతమంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు రెండింతలు చేసింది. దీంతో దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలకు డిమాండ్ ఏర్పడింది. వీటి కోసం ఎగబడుతున్నారు. సదరం శిబిరాలకు క్యూ కడుతున్నారు. స్లాట్‌బుకింగ్‌కు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎన్నడూలేని స్థాయిలో పోటీ ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.3 వేల నుంచి పింఛన్ రూ.6వేలు చేయడంతో వైకల్య ధృవపత్రాలకు డిమాండ్ ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం సదరం స్లాట్ ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8 నుంచి సచివాలయాలు, మీసేవ కేంద్రాలకు పోటెత్తారు. ఆరునెలల తరువాత స్లాట్ తెరుచుకోగా.. పెద్దఎత్తున నమోదు చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా సదరం శిబిరాల్లో ఇప్పటికీ నిరీక్షణ జాబితా చాంతాడంత పెరిగిపోయింది. కొత్తగా నమోదు చేసుకుంటున్న వారికి సదరం క్యాంపు పక్క జిల్లాలకు కేటాయిస్తున్నారు. అక్కడకు కూడా వెళ్తున్నారు. ఇటీవల జిల్లాకు సంబంధించిన స్లాట్‌బుక్ చేసుకున్న వారికి మనదపల్లి, తిరుపతి, చిత్తూరు శిబిరాలను కేటాయించారు. దీంతో వారంతా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నడూలేనివిధంగా సదరం క్యాంపునకు ఎక్కడాలేని ఒత్తిడి ఏర్పడింది. దీనిని క్యాష్ చేసుకునేందుకు వసూళ్లకు తెరలేపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరం శిబిరాలు అక్రమాలకు వేదికలుగా మారాయని బాధితులు వాపోతున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు వారు మండిపడుతున్నారు. డబ్బు ఇస్తే.. అర్హత లేకున్నా మంజూరు చేస్తున్నారనీ, పైసలివ్వలేని వారు అర్హులైనా తిరస్కరిస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి.



ఇళ్ల వద్దకు వెళ్లడంతో వెలుగులోకి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ మొత్తాన్ని పెంచేసింది. ఆ సొమ్మును సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు.. లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ మేరకు వారు వెళ్లడంతో అనర్హులు ఒక్కొక్కరే బయటకు వస్తున్నట్లు సమాచారం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పింఛన్లను జగన్ ఏర్పాటుచేసిన ప్రైవేటు సైన్యం వలంటీర్ల ద్వారా అందించారు. అనర్హత ఉన్నా వారు ఎక్కడా చెప్పకుండా కొన్నిచోట్ల వలంటీర్లు ప్రతినెలా పింఛన్‌లో కొంతమొత్తం తీసుకుని, లబ్ధిదారుడికి అందించారు. ఈనెల 1న పింఛన్ పంపిణీ చేయడానికి కూటమి నాయకులు ఇళ్లవద్దకు వెళ్లినపుడు అనర్హులు బయటపడ్డారు. ఒక్క హిందూపురంలోనే 300 దాకా అనర్హులు సర్టిఫికెట్లు పొందినట్లు నాయకులు అంచనా వేశారు. వచ్చేనెల మరికొన్ని బయటకు రావచ్చని భావిస్తున్నారు.

పింఛన్ మొత్తం పెంపుతో..

కూటమి అధికారంలోకి రావడంతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీతో సామాజిక భద్రత పింఛన్ల మొత్తాన్ని పెంచేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్‌ఐవీ బాధితులు, హిజ్రాలకు రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచారు. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలు చేశారు. ఇక కిడ్నీ, కాలేయం, గుండెమార్పిడి చేసుకున్నవారికి రూ.5వేల నుంచి ఏకంగా రూ.10వేలు చేశారు. మంచానికే పరిమితమైన వారికి రూ.5వేల నుంచి రూ.15వేలకు పెంచారు. దీంతో చాలామంది సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

అక్రమాలకు వేదికలుగా శిబిరాలు

గత వైసీపీ పాలనలో సదరం శిబిరాలను అక్రమాలకు వేదికలుగా మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో జిల్లా కేంద్రాలకే పరిమితమైన శిబిరాలను పీహెచ్‌సీలకు సైతం విస్తరించారు. ఇక్కడే అక్రమాలకు వేదికగా సదరం క్యాంపులు మారాయని అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. అక్కడున్న స్థానిక వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు నేరుగా జోక్యం చేసుకోవడంతో అనర్హులు లబ్ధిపొందారు. ప్రతి సచివాలయంలో ఇలాంటి వారికి పింఛన్ పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో అడుగేసిన వైద్యుడు ఏకంగా అనర్హులకు 1400 సర్టిఫికెట్లను ఇచ్చినట్లు రెండేళ్ల క్రితం ఆరోపణలు రావడంతో విచారణచేసి, అతడిని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు వైద్యులు ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడడంతో వారిపై కూడా రహస్యంగా విచారణ చేసి, ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని సమాచారం. సదరం శిబిరాలకు దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఓ గ్రామంలో యువకుడు దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడు. అతడికి 5శాతం కూడా వైకల్యం లేదు. అయినా వైసీపీ నాయకులు చెప్పడంతో రూ.10వేలు తీసుకుని, ఓ వైద్యుడు సర్టిఫికెట్ ఇచ్చాడు. అదే గ్రామంలో వందశాతం వైకల్యం ఉన్న మహిళకు మాత్రం 60 శాతమే ఉన్నట్లు చూపారు. ఇలాంటివి జిల్లాలో కోకొల్లలు. ప్రస్తుతం కూడా ఓ సర్టిఫికెట్‌కు రూ.10వేల నుంచి రూ.20వేలదాకా సదరం శిబిరాల్లో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హిందూపురం మండలంలోని ఓ మహిళకు వైకల్యం లేకున్నా సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోగా వైద్యులు కొంతమొత్తం తీసుకుని ఓకే చేసినట్లు తెలిసింది.

అర్హతలేనివారికి ఇస్తే కఠిన చర్యలు

పింఛన్ మొత్తం పెరిగిందని అనర్హులు సదరం సర్టిఫికెట్ కోసం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్యులు ఇవ్వకూడదు. అనర్హులకు సర్టిఫికెట్ ఇచ్చినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం. సర్టిఫికెట్ కోసం డబ్బు డిమాండ్ చేసినా, ఒత్తిళ్లకు తలొగ్గి అనర్హులకు ఇచ్చినా ఉద్యోగాలకే ఎసరు వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సదరం క్యాంపులో పాల్గొనే వైద్యులు అర్హత కలిగినవారికే సర్టిఫికెట్ ఇవ్వాలి.

-తిప్పేంద్రనాయక్, డీసీహెచ్‌ఎస్

వైభవం.. భూతప్పల ఉత్సవం..

మడకశిర రూరల్, జూలై 18: తొలి ఏకాదశిని ఉత్సవాల రెండోరోజు గురువారం మండలంలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి ఆలయ ఆవరణలో గురువారం భూతప్పల లఘు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత జిల్లేడగుండ ఆంజనేయస్వామి, భక్తరహళ్ళి నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానంలేని మహిళలు భక్తరహళ్ళి నరసింహస్వామి దేవాలయం వద్ద భూతప్పలు వచ్చే దారిలో నేలపై పడుకున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను తీసుకొస్తూ ఆ భక్తులపై భూతప్పలు కాలుమోపుతూ దేవాలయానికి చేరుకున్నారు. ఇలా భూతప్పలు కాలుమోపితే రోగాలు నయమై, మహిళలకు సంతానం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. అనంతరం భూతప్పలు కాలుమోపిన భక్తులు నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి, స్వామివారికి పూజలు నిర్వహించారు. రోజంతా జంట ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కర్ణాటక నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ నరసింహరాజు, అర్చకులు పాల్గొన్నారు.





↑ అలంకరణలో భక్తరహళ్ళి నరసింహస్వామి..
భక్తులపై కాలు మోపుతూ వస్తున్న భూతప్పలు ↓

సహకారం అందించండి..

కేంద్ర మంత్రులకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ విన్నపాలు
కేంద్ర మంత్రుల భరోసా



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 18: ఏపీలో అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.. పలువురు కేంద్ర మంత్రులను కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి సత్యకుమార్.. గురువారం రెండోరోజు కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, అటవీ, పర్యావరణ మంత్రి భూపేంద్రయాదవ్, ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కలిశారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి ప్రాంతాల ప్రత్యేకతలను జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వివరించారు. రాష్ట్రంలో చేనేత ఉత్పత్తులు పెంచేందుకు చేయూతనివ్వాలనీ, ధర్మవరంలో సిల్క్‌పార్కు, మంగళగిరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలకు కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించి, త్వరలో అమరావతికి వచ్చి అన్ని అంశాలపై చర్చిస్తామని గిరిరాజ్ సింగ్ హామీ ఇచ్చినట్లు మంత్రి సత్యకుమార్ ప్రకటనలో తెలిపారు. మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, చేనేతను ప్రోత్సహించేందుకు, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరచడానికి అన్ని చర్యలు తీసుకుంటాయని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌ను కలిసి గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందనీ, పర్యావరణ ఉల్లంఘనలు జరిగాయని ఆ వివరాలను సత్యకుమార్ తెలియజేశారు. విశాఖపట్నం రుషికొండపై పర్యావరణ ఉల్లంఘన చేయడమే కాకుండా వందలకోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, ఒక కుటుంబం కోసం ప్యాలెస్ కట్టారనీ, దీనిని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్ కోరారు. అమరావతిసహా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల మంజూరులో జాప్యంలేకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి గత ఐదేళ్లలో రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అత్యంతదయనీయంగా మారిందన్నారు. అమరావతికి అనుసంధానమయ్యే జాతీయ రహదారుల అభివృద్ధికి సహకారం అందించాలనీ, జాతీయ రహదారులకు అనుసంధానమయ్యే రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కూడా నిధులు విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని సత్యకుమార్ కోరారు. గత ఐదేళ్లలో కేంద్రం విడుదల చేసిన నిధులను పక్కదారి పట్టించడంపై గడ్కరీకి వివరాలు అందించారు. ధర్మవరం నుంచి బెంగళూరుకు జాతీయ రహదారి అనుసంధానానికి అనుమతులు ఇచ్చినందుకు నితిన్ గడ్కరీకి సత్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు అవకాశం ఉన్నతం త్వరగా మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై నితిన్‌గడ్కరీ సానుకూలంగా స్పందించారనీ, గత ఐదేళ్ల విధ్వంసం తన దృష్టికి వచ్చినట్లు ఆయన చెప్పినట్లు సత్యకుమార్ వెల్లడించారు. కేంద్ర మంత్రులతోపాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, పలువురు పార్టీ పెద్దలతో భేటీ అయినట్లు మంత్రి సత్యకుమార్ ప్రకటనలో వెల్లడించారు.

మంత్రిని కలిసిన ఎస్పీ



పెనుకొండ టౌన్/పుట్టపర్తి, జూలై 18: బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను జిల్లా నూతన ఎస్పీ రత్న కలిశారు. గురువారం పెనుకొండలోని మంత్రి స్వగృహంలో ఆమెను ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్క అందజేశారు. కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, డీఐజీ షిమోషిని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కలను అందజేశారు.

← మంత్రిని కలిసిన ఎస్పీ రత్న

వైసీపీ హయాంలో చెరువుల అభివృద్ధి గాలికి..

రూపాయి కూడా నిధులివ్వకపోవడం దారుణం: మంత్రి సవిత



చెరువు మరమ్మతులపై ఆరాతీస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూలై 18: గత వైసీపీ ఐదేళ్ల పాలనలో చెరువుల మరమ్మతులు, అభివృద్ధిని గాలికొదిలేశారని బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత విమర్శించారు. రొద్దం మండలంలోని కోగిర, పెద్దకోడిపల్లి చెరువులను మంత్రి సవిత గురువారం పరిశీలించారు. చెరువుకట్టలు, తూములు, పంట కాలువల స్థితిగతులపై నీటిపారుదల శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. కోగిర, పెద్దకోడిపల్లి చెరువుల మరమ్మతుల కోసం 2023లోనే ప్రతిపాదనలు పంపామనీ, ఇంతవరకు నిధులు మంజూరు కాలేదని అధికారులు వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. చెరువు మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో చెరువుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడాన్ని బట్టి చూస్తే రైతులపై ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. చెరువుకట్ట, పంట కాలువల మరమ్మతులు చేపడతామన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి అన్ని చెరువులకు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ గంగాధర్, ఎస్ఈ విశ్వనాథ్ రెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ, జేఈ ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సేవతోనే జీవితానికి సార్థకత

ఆర్జే రత్నాకర్.. ముగిసిన యువసమ్మేళనం



విద్యార్థికి మొమెంటో అందజేస్తున్న ఆర్జే రత్నాకర్, చక్రవర్తి

పుట్టపర్తి, జూలై 18: జీవరాశులన్నింటిలో మానవ జీవితం మహోన్నతమైనదనీ, తోటి వారికి, ప్రాణకోటికి సేవలందించడం ద్వారానే దానికి సార్థకత లభిస్తుందని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం అంతర్జాతీయ యువసమ్మేళనం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆర్జే రత్నాకర్ మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో బాధితులకు అవసరమైన సేవలు అందించడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. సత్యసాయి సేవాదళ్ అందిస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకం అయ్యాయన్నారు. సదస్సు సారాంశాన్ని జీవితసారాంశంగా మలుచుకోవాలని యువతకు దిశానిర్దేశం చేశారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో యువత భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం ట్రస్టు సభ్యుడు చక్రవర్తితో కలిసి రత్నాకర్.. యువతను మొమెంటోలతో సత్కరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి

న్యాయాధికారుల సూచన



ర్యాలీ చేస్తున్న న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది

హిందూపురం, జూలై 18: వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణం నుంచి గురువారం మోటారు వాహనాల చట్టంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి కంపల్లె శైలజ మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. ఎంతో విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయన్నారు. వారి కుటుంబాలు తీవ్ర క్షోభ అనుభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో వాహనం నడిపే ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ప్రమాదాలు జరిగితే వారి తల్లిదండ్రులదే బాధ్యత అనీ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణంతీసిన నిర్లక్ష్యం..!

- పాముకాటుతో ఆస్పత్రికి బాధితుడు
- వైద్యం అందక మృతి
- మడకశిర ఆస్పత్రి వైద్యులపై ఎమ్మెల్యే ఆగ్రహం
- వైద్యశాఖ మంత్రికి ఫిర్యాదు

ఆస్పత్రిలో మడివాళప్ప మృతిపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే



మడకశిర, జూలై 18: వైద్యుల నిర్లక్ష్యానికి ఓ నిండుప్రాణం బలైంది. పాముకాటుతో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి వైద్యం అందించే నాథుడు లేడు. దీంతో అక్కడే ప్రాణం విడిచాడు. దీనిపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మడకశిర ప్రభుత్వాస్పత్రి వైద్యులపై మండిపడ్డారు. వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమరాపురానికి చెందిన మడివాళప్ప (55) గురువారం పశువులకు మేత వేసేందుకు వెళ్లాడు. గడ్డివాము వద్ద పాము కాటేసింది. వెంటనే అమరాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి, ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి నుంచి మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి 2.20 గంటలకు తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యులు లేరు. అరగంట అనంతరం మడివాళప్ప మృతిచెందాడు. సకాలంలో వైద్యసేవలు అందకపోవడం కారణంగానే మృతిచెందినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే ఆగ్రహం

మడివాళప్ప మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. డాక్టర్లు విధులకు గైర్హాజరయ్యారని తేలింది. రిజిస్టర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. డాక్టర్ శశిరేఖ డ్యూటీ రిజిస్టర్‌లో సంతకం చేయకపోవడం, లీవ్‌లెటర్ కూడా ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని మండిపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారిపైనైనా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ దృష్టికీ తీసుకెళ్లారు.

బహిరంగ వేలము ప్రకటన

సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము, శ్రీ సత్యసాయి జిల్లా. తేది:16.07.2024

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టరు, శ్రీసత్యసాయి జిల్లా వారి ఉత్తర్వుల నెం.RC.No. K8/63/2024 తేది. 16.07.2024 మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం జప్తు చేయబడి ఈ క్రింద తెలుపబడిన 07 మండల స్థాయి గోదాముల నందు నిల్వ ఉంచిన బియ్యమును వేలము వేయుటకు నిర్దేశించడమైనది.

సీజ్ చేయబడిన బియ్యం (Raw Rice) నిల్వ ఉన్నమండల స్టాక్ పాయింట్లు

క్రమ సం	మండల స్థాయి గోదాము పేరు	వేలం నిర్వహించబడును సరుకు మొత్తం (క్వింటాళ్లలో)	బహిరంగ వేలము నిర్వహించు ప్రదేశము తేది మరియు సమయం	దరఖాస్తు రుసుము మరియు ధరావత్తు	దరఖాస్తు పొందు ఆఖరు తేది, సమయం మరియు ప్రదేశం (డిస్ట్రిక్ట్ సప్లై ఆఫీసర్ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, శ్రీ సత్యసాయి జిల్లా.)	దరఖాస్తు సమర్పించు చివరి తేదీ మరియు సమయం
1	చెన్నేకొత్తపల్లి	884.81	కలెక్టర్ హాల్ కలెక్టరు కార్యాలయము, శ్రీ సత్యసాయి జిల్లా ఆగస్ట్ 02వ తేది మధ్యాహ్నం 3.00 గంటలకు	రూ.3000/- మరియు రూ. 2,00,000/	బహిరంగ వేలము ప్రకటన ఇచ్చినప్పటి నుండి ఆగస్ట్ 02 వ తేది ఉదయం 11 గంటల (కార్యాలయ పని వేళల మరియు పని దినాలలో)	ఆగస్ట్ 02 వ తేది మధ్యాహ్నం 12 గంటల వరకు
2	గాండ్లపెంట	9.32				
3	కదిరి	1028.50				
4	మడకశిర	543.50				
5	ఓ.డి.చెరువు	1561.20				
6	పెనుకొండ	613.26				
	మొత్తము	3227.21				

నిబంధనలు:

1. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు, వేలంలో బియ్యం కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్న ధరను దరఖాస్తునందు తప్పనిసరిగా పొందుపరచవలెను.
2. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు District Civil Supply Officer Sri Sathyasai District వారి పేరు మీద చెల్లుబాటు అగునట్లు డి.డి.2,00,000/- తీయవలెను.
3. కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు వారి లైసెన్స్ ఉన్న ట్రేడర్/రైస్ మిల్లర్ అయి ఉండవలెను.
4. వేలము ముగిసిన అనంతరం అర్హత పొందని వారికి వేలం కోసం చెల్లించిన ధరావతు సైకమునకు సంబంధించిన రసీదు తీసుకొని డి.డి.తిరిగి ఇవ్వబడును.
5. బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారు వేలం ముగిసిన 5 దినములలో మొత్తం సైకం చెల్లించి, సైకం చెల్లించిన 15 దినములలో సరుకును స్వాధీన పరుచుకొని 30 దినములలో ఉపయోగించుకోవలెను.
6. వేలం పాటలో అర్హత పొంది నిర్ణీత సమయంలో మిగిలిన సైకమును చెల్లించని యెడల ధరావతుగా చెల్లించిన సొమ్ము (డి.డి) తిరిగి ఇవ్వబడదు.
7. వేలం ద్వారా పొందిన బియ్యాన్ని మళ్లించడం లేదా స్టాకును దుర్వినియోగం చేయడాన్ని నిరోధించుటకు బియ్యం యొక్క కార్యక్రమ ముగింపు వరకు స్టాకు ఉపయోగమును మరియు తరలింపు విధానాన్ని రెవిన్యూ/ పౌరసరఫరాలు/ విజిలెన్సు మరియు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గమనిస్తూ ఉంటారు.
8. వేలము వేయు సరుకును కార్యాలయ పనిదినములలో వేలము జరుపుటకు ముందు రోజులలోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పై పట్టికలో కనపరచిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును.
9. బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాడిన ట్రేడర్/ రైస్ మిల్లర్ వారు రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి పై వివరాల వారిగా మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను.
10. ఈ బహిరంగ వేలం అనేది జిల్లా సంయుక్త కలెక్టరు వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

(for further information and application format visit http://srisathyasai.ap.gov.in/ notice category/ announcements

సంయుక్త కలెక్టరు వారి తరుపున / శ్రీసత్యసాయి జిల్లా

ఒక్క రోజులో 7 టీఎంసీల చేరిక



టీబీ డ్యాంలోకి చేరిన వరదనీరు

బొమ్మనహాళ్, జూలై 18: తుంగభద్ర జలాశయంలోకి వరదనీరు పరవళ్లు తొక్కుతూ చేరుతోంది. తుంగభద్ర జలాశయంలో గురువారం ఒక్కరోజే ఏడు టీఎంసీల నీరు చేరింది. తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో మరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయంలోకి ఒక్కరోజున ఏడు టీఎంసీల నీటి నిలువ పెరిగింది. గురువారం ఉదయం 46.80 టీఎంసీల నీటి నిల్వ ఉంది. తుంగ నుంచి భారీ నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. మరింత పెరిగే అవకాశం ఉంది. గురువారం ఉదయం 82,491 క్యూసెక్కుల నీరు రాగా 1,04,060 క్యూసెక్కులకు అడుగుల నీటిమట్టంగాను 1614.31 అడుగులు ఉంది. అవుట్ ఫ్లో 300 క్యూసెక్కులు ఉంది. మరో రెండువారాల పాటు ఇదే తరహాలో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు డ్యామ్ అధికారులు అంటున్నారు. వచ్చేవారంలో జలాశయం పూర్తిగా నిండే పరిస్థితి వస్తుందని అధికారులు అన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే తల్లికి వందనం

ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం విద్య, జూలై 18 : 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఉపాధ్యాయభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ... తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు కూడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు లక్షలాది మంది విద్యార్థులు తరలి వెళతారని అన్నారు. ఇప్పటికే మూడేళ్ల నుంచి సుమారు 10 లక్షల మంది ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లారని అన్నారు. దీన్ని నివారించాలంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేయాలని కోరారు. అదే విధంగా జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన ఈ జీవో వల్ల 3,4,5 క్లాసులు విచ్ఛిన్నం అయ్యాయంటూ మండిపడ్డారు. తెలుగుమీడియం బోధన సైతం అన్ని పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్మీ మాజీ డాక్టర్ నారాయణప్ప మృతి

మాజీ సైనికుల నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 18: ఆర్మీ మాజీ డాక్టర్ నారాయణప్ప మృతికి మాజీ సైనికులు నివాళులర్పించారు. ఈ మేరకు మంగళవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో పలువురు మాజీ సైనికులు నగరంలోని నారాయణప్ప స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహానికి జాతీయ జెండాతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ ఆర్మీలో డాక్టర్‌గా నారాయణప్ప ఎన్నో సేవలందించారని కొనియాడారు. గాయపడిన సైనికులకు సకాలంలో చికిత్సలు అందించడంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. నివాళులర్పించిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, మణికుమార్, హుస్సేన్, పీరా, బీఏ హుస్సేన్, నరసింహులు, హరినాథ్, పెంచలయ్య, ఖాజామొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీల నియామకం



ప్రొఫెసర్ సుదర్శన రావు



ప్రొఫెసర్ అనిత

అనంతపురం సెంట్రల్, జూలై 18: జేఎన్‌టీయూ, ఎస్కేయూకి రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీలను నియమించింది. జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ సుదర్శన రావును నియమించింది. ఆయన సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ బి.అనితను ప్రభుత్వం నియమించింది. ఆమె ఎంబీఏ విభాగం ప్రొఫెసర్. తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా వీరు ఇన్‌చార్జి వీసీలుగా కొనసాగుతారు. ఈ నియామకాల్లో సీనియార్టీ, పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని వర్సిటీల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సిఫార్సులు, ప్రలోభాలకు తావులేకుండా వర్సిటీల పురోభివృద్ధిని దృష్టిలోపెట్టుకుని ఇన్‌చార్జి వీసీలను ప్రభుత్వం నియమించిందని అభినందించారు.

రెవెన్యూ తప్పిదాలు.. విద్యార్థులకు తిప్పలు

- ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో గందరగోళం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హతగా గుర్తింపు
- బీటెక్ ప్రవేశ విద్యార్థుల్లో ఆందోళన
- సవరణకు ప్రభుత్వం అవకాశం
- హెల్ప్‌లైన్ సెంటర్లలో మార్పునకు చర్యలు

అనంతపురం సెంట్రల్, జూలై 18: రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీస పరిశీలన లేకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో చాలామంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కోల్పోయారు. బీటెక్ కోర్సులు అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. ఇందుకు అర్హత సాధించాలంటే ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు జారీచేసే సచివాలయాల్లో దరఖాస్తుదారుల వివరాల నమోదులో క్రమపద్ధతిని పాటించలేదు. తండ్రికి బదులుగా విద్యార్థి పేరుతో ఇన్‌కమ్ సర్టిఫికెట్స్‌ను జారీ చేశారు. దీంతో ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో సర్టిఫికెట్లను తిరస్కరించారు. వెరసి అనేకమంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులుగా మిగిలిపోయారు. సీట్ అలాట్‌మెంట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆప్షన్ నో అని రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసానిచ్చింది. మరోసారి ఆదాయ ధ్రువపత్రాలను సమర్పించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లను అందుబాటులో ఉంచింది.

ఇలా సరిదిద్దుకోవాలి..

ఆదాయ ధ్రువీకరణ ప్రతంలోని 'ఇన్‌కమ్ ఫ్రమ్ ఆల్ సోర్సెస్ ఆఫ్' అన్న తర్వాత తండ్రి పేరు ఉండాలి. ఆ తరువాత 'ఫాదర్ ఆఫ్, మదర్ ఆఫ్'గా విద్యార్థి పేరు ఉండాలి. అయితే తండ్రి ప్లేస్‌లో విద్యార్థి పేరు, విద్యార్థి ప్లేస్‌లో తండ్రి పేరును చేర్చడం ద్వారా విద్యార్థి ఆదాయం పొందుతున్నట్లు పత్రాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఫీజు రీయింబర్స్‌మెట్‌కు సంబంధిత విద్యార్థులు రిజెక్ట్ అయ్యారు. విద్యార్థులు సచివాలయానికెళ్లి ఈ విషయాన్ని తెలియపరచి కొత్త ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి. అనంతరం జేఎన్‌టీయూ పరిపాలన భవనం, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈఏపీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించి సమర్పించాలి. అక్కడి అధికారులు సంబంధిత విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హులుగా నమోదు చేస్తారు.

కంగారు పడ్డా



నా కుమార్తెకు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు అలాట్ అయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని చెప్పడంతో కంగారు పడ్డాను. ఇలా ఎందుకని ఆరా తీస్తే.. ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు. ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇచ్చాం. ఈ సర్టిఫికెట్స్‌లో పేర్లను తారుమారు చేశారు. నాపేరుకు బదులుగా నా కూతురు పేరు ఉందని చెప్పారు. దీంతో మళ్లీ సర్టిఫికెట్స్‌ను తీసుకువచ్చి హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇవ్వడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత వచ్చింది. ఇందుకు ప్రభుత్వం చొరవ మరువలేం.

-మురళి, విద్యార్థిని తండ్రి, పులివెందుల

సవరణకు అవకాశం



మాలాంటి పేదలందరికీ బీటెక్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ఇన్‌కమ్ సర్టిఫికెట్ సవరణ అవకాశాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. నా కుమారుడికి ఎస్ఆర్ఐటీలో సీటు వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆప్షన్‌లో అనర్హతగా తేల్చారు. ఇదేంటని అధికారులను ప్రశ్నించగా కౌన్సిలింగ్‌లో కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పుగా ఇచ్చివుంటారన్నారు. వెంటనే సచివాలయానికెళ్లి తప్పుల్లేని ఇన్‌కమ్ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇచ్చాను. దీంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా ఆప్షన్ ఇచ్చారు.

-లాలెప్ప, విద్యార్థి తండ్రి, అనంతపురం

వయోజన బీసీజీ టీకాతో సురక్షితం



కదిరి అర్బన్, జూలై 18: క్షయ రహిత సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం, టీబీ ముక్త భారత్ కార్యక్రమాన్ని చేపట్టింది. క్షయవ్యాధి నిర్మూలన కోసం బీసీజీ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టింది. టీకా సురక్షతమని, ఎటువంటి చెడు ప్రభావాలు లేవని, ప్రతి ఒకరూ తప్పకుండా ఈ టీకా వేయించుకొని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి టీకాలు వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 15 వరకు నిర్వహిస్తారు. ప్రతి గురు, సోమవారాల్లో టీకాలు వేస్తున్నారు.

ఈ లక్షణాలున్న వారికి తప్పనిసరి

ఈ లక్షణాలున్న ప్రతి ఒకరు బీసీజీ టీకాలు వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఐదేళ్లలో టీబీ వచ్చితగ్గిపోయినవారు తప్పకుండా ఈ టీకా వేయించుకోవాలి. అలాగే 60 సంవత్సరాలు నిండిన, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీఎంఐ (శరీర ద్రవరాశి సూచిక, లేక ఎత్తుకు తగ్గిన బరువు) 18 కంటే తక్కువ ఉండేవారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారు తప్పకుండా ఈ టీకా వేయించుకోవాలని సూచిస్తున్నారు.

వీరికి ఈ టీకా వద్దు

టీబీ వ్యాధి ఉండి, మందులు వాడుతున్నవారు, గర్భవతులు, పాలు ఇచ్చే తల్లులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులు ఈ టీకా వేయించుకోరాదు. అంతేకాకుండా 18 సంవత్సరాలు నిండనివారు... రక్తదానం చేసిన మూడు నెలల వరకు టీకా వేయించుకోరాదు.

క్షయవ్యాధి అంటే..

క్షయవ్యాధి.. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అంటువ్యాధి, ఈ వ్యాధి స్త్రీ, పురుషులకు వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. ఈ వ్యాధి శరీరంలోని ఏ అవయవానికైనా రావచ్చు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఎక్కువగా సోకుతుంది. క్షయవ్యాధి రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు గాలిలో తుంపర్లుగా వెళ్లుతాయి. వీటిని ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు ఈ వ్యాధి వారికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణకు, పుట్టిన పసిబిడ్డలకు బీసీజీ టీకాలు ఇప్పించాలి. క్షయ రోగి ఎక్కడబడితే అక్కడ ఉమ్మివేయరాదు. క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



క్షయవ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఈవ్యాధికి చిన్న, పెద్ద, స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరికి సోకుతుంది. భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బీసీజీ టీకా సురక్షితమైంది. క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దల్లో టీబీ నుంచి రక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. క్షయను నిర్మూలించేదుకు ప్రతి ఒకరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

- డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ

పురం మున్సిపాలిటీలో
బిల్లుల కలకలం..!



మాజీ కమిషనర్‌పై చైర్‌పర్సన్ అవినీతి ఆరోపణలు
ఏసీబీకి ఫిర్యాదు... ఆలస్యంగా వెలుగులోకి..

హిందూపురం, జూలై 18: మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపు వ్యవహారం కలకలం రేపింది. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రమోద్‌కుమార్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డాడనీ, విచారణ చేపట్టాలని ఏసీబీకి చైర్‌పర్సన్ ఇంద్రజ ఫిర్యాదు చేయడం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా చెక్కుల రూపంలో కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారనీ, అందులో పర్సెంటేజీలు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. కొన్ని పనులు చేయకుండానే బినామీ పేర్లతో బిల్లులు కాజేశారని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు వారం క్రితం ఏసీబీకి ఫిర్యాదు చేసిన విషయం గురువారం వెలుగు చూసింది. అందుకు సంబంధించిన కాపీలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లకు సీఎఫ్ఎంఎస్ నుంచి కాకుండా నేరుగా చెక్కులు ఇవ్వడం దుమారం రేపుతోంది.



రూ.కోట్లలో అక్రమాలు

మున్సిపల్ మాజీ కమిషనర్ ప్రమోద్‌కుమార్, అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న జేఏఓ మనోహర్ కుమ్మక్కై కొంత మంది కాంట్రాక్టర్లకు నేరుగా చెక్కులు ఇచ్చారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు పనిచేస్తే వాటికి సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు చేయాలి. అలాకాకుండా తమకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు చెక్కులు రాసి ఇచ్చినట్లు చైర్‌పర్సన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా రూ.2కోట్ల వరకు చెక్కులు ఇచ్చినట్లు తెలిసింది. ప్రతి బిల్లూ సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించాలని నిబంధనలున్నా.. ఇలా చెక్కుల రూపంలో ఇవ్వడం దారుణమని చైర్‌పర్సన్ ఆరోపించారు.

కలెక్టర్ ఆదేశించినా విచారణ శూన్యం

గతేడాది డిసెంబరులో మున్సిపాలిటీలో అక్రమాల వ్యవహారం అప్పటి కలెక్టర్ దృష్టికెళ్లగా.. సమగ్రంగా విచారణ చేయాలని మున్సిపల్ ఆర్డీకి ఆయన ఆదేశించారు. అయినప్పటికీ ఇంతవరకు విచారణ చేపట్టినట్లు దాఖలాలు లేవు.

చైర్‌పర్సన్ ఫిర్యాదుతో వెలుగులోకి..

అకౌంట్స్ విభాగంలో అవినీతి భారీఎత్తున జరిగిందని కోట్ల రూపాయలు పక్కదారి పట్టించారనీ, దీనిపై లోతుగా విచారణ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఈనెల 9న ఏసీబీ అధికారులకు లేఖ రాశారు. గతంలో పనిచేసిన కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తోపాటు ప్రస్తుతం అకౌంట్స్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న మనోహర్ కలిసి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. ఏసీబీతోపాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌కు కూడా కొన్ని ఆధారాలు జతచేసి లేఖ పంపారు. చైర్‌పర్సన్ పంపిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పనులు చేయకపోయినా కొంతమంది కాంట్రాక్టర్లకు చెక్కులు ఇచ్చి, 20 నుంచి 30 శాతం కమీషన్ దండుకున్నట్లు చైర్‌పర్సన్ ఏసీబీకి పంపినలేఖలో పేర్కొన్నారు. ఈ అవినీతిపై లోతుగా విచారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఈ పరిణామం కాంట్రాక్టర్లలో కలకలం రేపింది. దీనిపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపడితే ఎంతమేర అవినీతి జరిగిందో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నేడు గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనం

నార్పల, జూలై 18: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనం శుక్రవారం ఉంటుందని ఈఓ శోభ గురువారం తెలిపారు. రాత్రి గంట పాటు ఆలయం బయట నుంచి కుళ్లాయిస్వామిని భక్తులకు చూపించి పెట్టెలో భద్రపరుస్తామన్నారు. శుక్రవారంతో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆమె తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, జూలై 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 436 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.60

అనంతపురం రూరల్, జూలై 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.60తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.53, కనిష్ఠ ధర రూ.40 పలికినట్లు ఆయన తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి పట్టివేత

ఉరవకొండ,జూలై18: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ఉరవకొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గుత్తి మండలం టీ. కొత్తపల్లికి చెందిన నరేష్ గంజాయి కేసులో నిందితుడుగా ఉన్నాడు. అతడిని గుత్తి నుంచి విశాఖపట్నంకు గత మంగళవారం తీసుకెళ్తుండగా మార్కాపురం వద్ద తప్పించుకుని పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఉరవకొండలోని కణేకల్లు సర్కిల్‌లో గంజాయి అమ్ముతానంటూ కొంత మందికి చెప్తుండగా స్థానికులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సురేష్‌బాబు సిబ్బంది అంజి, సోము, కులశేఖర్ వెంటనే అక్కడకు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిని అనంతపురం పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ శాఖలో ఉద్యోగోన్నతులు

అనంతపురం రూరల్, జూలై 18: ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీఎండీ సంతోష్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని పలువురు అధికారులను టీఎస్ఎస్పీడీసీఎల్‌కు కేటాయించారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తిరిగి వారిని ఏపీఎస్పీడీసీఎల్‌కు కేటాయించారు. ప్రస్తుతం సదరు అధికారులు తిరుపతి కార్పొరేట్ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ఉన్నారు. ఈ క్రమంలోనే వారికి ఉద్యోగోన్నతులు దక్కాయి. గతంలో జిల్లా ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈగా పనిచేసిన సంపత్‌కుమార్‌కు ఎస్ఈగా ఉద్యోగోన్నతి లభించింది. ఎస్ఏఓగా పనిచేసిన విజయ్‌భాస్కర్‌కు జీఎంగా, డీఈఈలుగా పనిచేస్తున్న డీఎస్ విజయ్‌రాజు, శివరాములు, వీఎం రవిశంకర్, ప్రసాద్‌కు ఈఈలుగా ఉద్యోగోన్నతి లభించింది. రెండు మూడురోజుల్లో వీరికి పోస్టింగులు ఇవ్వనున్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు



పరుగు తీస్తున్న ఎద్దులు

కొత్తచెరువు, జూలై 18: తొలిఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని పుట్టపర్తి, బుక్కపట్నం రహదారిలో ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పరుగుపందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముందుగా కొత్తచెరువమ్మ ఆలయం వద్ద పూజలు చేసి, పోటీలు ప్రారంభించారు. ఒక్కో బండి పరుగులు పెడుతుంటే హాజరైన వారంతా కేకలు వేస్తూ, కేరింతలు కొడుతూ సంబరంగా గడిపారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన బుచ్చయ్యగారిపల్లి రామాంజి ఎద్దులు విజేతగా నిలిచాయి. బీసీకాలనీకి చెందిన గౌడ్ ఎద్దులు రెండో, జానకంపల్లి వెంకటేశ్ ఎద్దులు మూడో బహుమతి గెలుచుకున్నాయి. విజేత ఎద్దులకు రూ.40వేలు, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు రూ.25వేలు, రూ.15వేలను చొప్పున సీఐ రాజారమేశ్, టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు అందజేశారు.

అటవీశాఖ పునర్విభజన

- మారనున్న జిల్లా అటవీ ముఖచిత్రం
- కొత్తగా ఒక రేంజ్, 5 సెక్షన్లు, 14 బీట్స్
- కసరత్తు ప్రారంభించిన యంత్రాంగం

అనంతపురం న్యూటౌన్, జూలై 18: జిల్లా అటవీశాఖ ముఖచిత్రం మారనుంది. ప్రస్తుతం ఉన్న మూడు రెంజ్‌లకు తోడు కొత్తగా తాడిపత్రి రేంజ్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఉన్న తొమ్మిది సెక్షన్స్‌కు అదనంగా మరో అయిదు సెక్షన్స్ ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 27 బీట్స్‌కు తోడు మరో 14 బీట్స్ ఎర్పడనున్నాయి. దీంతో మొత్తం బీట్స్ సంఖ్య 41కి చేరనుంది. ఈ విభజనకు అనుగుణంగా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

అడవులను కోల్పోయిన అనంత

ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, పెనుకొండ, బుక్కపట్నం, కదిరి.. మొత్తం ఆరు రేంజ్‌లు ఉండేవి. జిల్లా విభజనతో శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి బుక్కపట్నం, పెనుకొండ, కదిరి రేంజ్‌లు వెళ్లాయి. ఎక్కువ అటవీ విస్తీర్ణం ఉన్న రేంజ్‌లు ఇవి. అనంతపురం జిల్లాలోని అనంతపురం, గుత్తి రేంజ్ పరిధిలో ఎక్కడా పెద్ద అడవులు లేవు. కళ్యాణదుర్గం రేంజ్‌లో మాత్రమే ఒక రకమైన అడవులు ఉన్నాయి. జిల్లా విభజన అనంతరం మరోసారి అటవీశాఖ బైఫరగేషన్ దిశగా చర్యలు తీసుకుంటోంది.

కొత్తగా తాడిపత్రి రేంజ్..

యాడికి బీట్‌ను రెండుగా విడగొడుతున్నారు. ఈ రెండింటిని తాడిపత్రి సెక్షన్‌గా చేశారు. ముచ్చుకోట, పుట్లూరు సెక్షన్స్‌తో కలిపి తాడిపత్రి రేంజ్ ఏర్పడనుంది. ఇందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్య పెరగనుంది. అనంతపురం రేంజ్ పరిధిలో అనంతపురం, ఆత్మకూరు, గార్లదిన్నె సెక్షన్‌లు ఉంటాయి.

కొత్త సెక్షన్స్ ఇలా..

అటవీశాఖ బైఫరగేషన్‌లో భాగంగా కొత్తగా 5 సెక్షన్స్ ఏర్పాటు కానున్నాయి. గార్లదిన్నె, ఉరవకొండ, శెట్టూరు, డి.హీరేహాళ్, తాడిపత్రి సెక్షన్స్ కొత్తగా ఏర్పడుతున్నాయి.

కొత్త బీట్స్ ఇవే..

కనంపల్లి, కలగల్లు, పంపనూరు, డి.హీరేహాళ్, ఆత్మకూరు, వెంకటాంపల్లి, కండ్లగూడూరు, అనుంపల్లి, గొల్లలదొడ్డి, దోనలేడు, ముద్దినాయనపల్లి, హొన్నూరు, గుమ్మఘట్ట.



జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయం

విభజన ఇలా..

శింగనమల బీట్‌ను రెండుగా విభజిస్తారు. శింగనమల, కనంపల్లి బీట్స్‌గా విడగొడుతున్నారు. మరుట్ల నార్త్, సౌత్ బీట్స్‌కు అదనంగా కలగల్లు బీట్ ఏర్పాటు చేస్తారు. ఆత్మకూరు, వడ్డుపల్లి బీట్స్‌కు తోడు పంపనూరు బీట్ ఏర్పాటు చేయనున్నారు. గుత్తి రేంజ్‌లోని రాయలచెరువు బీట్‌ను రెండుగా విడగొడుతున్నారు. కొత్తగా కండ్లగూడూరు బీట్ ఏర్పాటు కానుంది. యాడికిని రెండు బీట్స్‌గా విడగొడుతూ.. కొత్తగా కోనఉప్పలపాడు బీట్ ఏర్పాటు చేస్తున్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న చిలకం

ధర్మవరం, జూలై 18: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ మహాయజ్ఞ కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాల్గవ విడత క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరు సభ్యులుగా భాగస్వాములై మిగిలిన వారితో కూడా సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ఈ సభ్యత్వం చేయించుకోవడం వల్ల రూ.5 లక్షలు ప్రమాద జీవిత బీమా సౌకర్యం, ప్రమాద బీమా రూ.50 వేలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, వెంకటరెడ్డి, బాలక్రిష్ణ, రామాంజి పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తిలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పుట్టపర్తి సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పదిరోజుల పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 50 మంది వలంటీర్లను నియమించామన్నారు. రూ.ఐదువందలతో సభ్యత్వ నమోదు చేసుకుంటే పార్టీ సభ్యత్వంతోపాటు రూ.5 లక్షల ఇన్సురెన్స్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బొగ్గరం శ్రీనివాసులు, విష్ణువర్దన్ గాజుల నాగేంద్రప్రసాద్, మల్లేసు, రాము,గణేష్, శేఖర్, సతీష్, సల్మాన్, నవీన్‌గోవర్ధన్, రాజేష్,షేక్ రహంతుల్లా పాల్గొన్నారు.

షాపింగ్ మాల్ మూసివేయాలని ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న వ్యాపారులు

ధర్మవరం, జూలై 18: ధర్మవరం పట్టణంలో గత ఏడాది ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్ మూసివేయాలని వస్త్రవ్యాపారులు, రెడీమేడ్ టెక్స్‌టైల్స్ వ్యాపారులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. నేసేపేటలోని పుట్లమ్మ ఆలయం నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ తేరుబజారు, అంజుమన్, ఎన్టీఆర్, కళాజ్యోతి, కాలేజ్ సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపానికి రాగానే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వ్యాపారులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. షాపింగ్ మాల్‌ను మూసివేయాలని నినదించారు. ఈ సందర్భంగా పట్టుచీరల తయారీ సంఘం అధ్యక్షుడు గిర్రాజురవి మాట్లాడుతూ... షాపింగ్‌మాల్‌ను ఏర్పాటు చేయడం వల్ల వస్త్ర, రెడీమేడ్ టెక్స్‌టైల్స్ దుకాణాలలో వ్యాపారాలు జరగక చివరికి అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితికి చేరుకున్నాయన్నారు. షాపింగ్ మాల్‌లో నాణ్యత లేని దుస్తులను కేజీ లెక్కన అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. షాపింగ్‌మాల్ అక్రమ కట్టడంలో నిర్వహిస్తున్నారని, ఆ మాల్‌ను మూసివేయించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ రమేశ్ ధర్నా చేస్తున్న వ్యాపారులతో మాట్లాడారు. వస్త్ర వ్యాపారులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ... షాపింగ్ మాల్ విషయం ఇప్పుడే తెలిసిందని, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో వ్యాపారులు గుండాపుల్లయ్య, శేషాద్రిరెడ్డి, కోటి వెంకటేశ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ధర్మవరం రూరల్, జూలై 18: మండలంలోని చిగిచెర్ల-ధర్మవరం రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి పడి మరణించాడు. చిగిచెర్ల సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ మృతదేహం పడి ఉండటాన్ని రైల్వే కీమ్యాన్ గుర్తించి.. రైల్వేఎస్ఐ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చాడు. ఆయన సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండవచ్చుని, ఆర్‌సీబీ క్రికెట్ టీంకు సంబంధించి నీలం టీషర్టు, క్రీంకలర్ ఫ్యాంట్ ధరించాడని అన్నారు. అయితే మృతుని ఆచూకీ తెలియక పోవడంతో గుర్తుతెలియని శవంగా కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు ధర్మవరం జీఆర్‌పీ సెల్‌నెంబర్లు 9440557054, 9951325345కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యా సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ, టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జూలై 18: స్థానిక వడ్డిపేట ప్రాథమిక పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు టీడీపీ మండల మైనార్టీ నాయకులు రియాజ్ బాషా, సలీమా దంపతులు గురువారం నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్లు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం బిస్కెట్ ప్యాకెట్లు, అరటి పండ్లు అందించారు. అనంతరం ఆ దంపతులను ఎంఈఓ రమణప్ప, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, వెంకటనాయుడు, రామాంజినేయులు, అల్లిపీరా, లావణ్య పాల్గొన్నారు.

ముగిసిన మొహరం

ధర్మవరం, జూలై 18: పట్టణంలో మొహరం ఉత్సవాలు గురువారం ముగిశాయి. మొహరంఉత్సవాలలో భాగంగా పీర్లస్వాములు అగ్నిగుండ ప్రవేశంచేశాయి. అనంతరం జలదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేశారు. యువకులు అలావ్ తొక్కుతూ ఉత్సాహంగా సందడిచేశారు. ఈ ఉత్సవాలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, ఏఎస్ఐ డోణాసింగ్ సిబ్బందితో కలిసి ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తెగిపడిన విద్యుత్‌వైరు



కొత్తచెరువు, జూలై 18: స్థానిక పెద్ద మసీదు వద్ద 11 కేవీ విద్యుత్ వైరు గురువారం తెగి వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన రహదారిపై పడింది. పొలాలకు వెళ్లే పెలమన్నగారి మధు ఆ విద్యుత్ వైరును గుర్తించి వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. ట్రాన్స్‌కో అధికారులు మరమత్తులు చేపట్టారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



ధర్మవరం రూరల్, జూలై 18: మండలంలోని పోతుకుంట ఎస్సీకాలనీలో శ్రీలక్ష్మీనరసిం హస్వామి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం స్వామివారికి విశేషపూజలు చేశారు. ఉదయం 5గంటలకే నాగదేవతలకు పూజలు, 12 గంటలకు దాసంగాలు, 4 గంటలకు భక్తుల కోర్కెలతీర్చుట, రాత్రి 8గంటలకు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

అంతర్జాతీయ క్రీడాపోటీల్లో ప్రతిభ



ధర్మవరం, జూలై 18: నేపాల్‌లో ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు యశోద పాఠశాల డైరక్టర్ పృథ్వీరాజ్ గురువారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తమ్మయి చరణ్, యశ్వంత్ కుమార్ ఆ పోటీల్లో పాల్గొని రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ విద్యార్థులను డైరక్టర్‌తోపాటు ప్రిన్సిపల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

అనారోగ్యంతో న్యాయవాది మృతి



కదిరిలీగల్, జూలై 18: కదిరిలో న్యాయవాదిగా పనిచేస్తున్న బోనాల బ్రహ్మాచారి (70) బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయన అనారోగ్యంతో ఉండడంతో బెంగుళూరు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బ్రహ్మాచారి ఆంధ్రబ్యాంక్ మేనేజర్‌గా, ప్రైవేటు పాఠశాల సాయి బ్రహ్మ యజమానిగా పనిచేశారు. ఆయన మృతికి పలువురు న్యాయవాదులు సంతాపం తెలిపారు.

అక్రమార్కుల తాట తీస్తాం

వైసీపీ భూకబ్జాలను వెలికి తీస్తాం.. ఎమ్మెల్యే కందికుంట హెచ్చరిక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 18: నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడిన వారి తాట తీస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ హయాంలో పాల్పడిన భూకబ్జాలను వెలికి తీస్తామన్నారు. నయాపైసాతో సహా ప్రభుత్వానికి వెనక్కు కట్టిస్తామన్నారు. దీనివెనుక ఉన్న భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు. కదిరిలో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలు, భూదందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ముఖ్యమంత్రిని కోరతామన్నారు. వైసీపీ అక్రమాలపై త్వరలో చాయ్‌పే చర్చ పెడతామని చెప్పారు. మున్సిపాలిటీలో కుంభకోణాలను ఒక్కొక్కటిగా విచారణ చేయిస్తామని స్పష్టంచేశారు. అక్రమంగా లాఠీచార్జి చేయించిన, అక్రమ మైనింగ్ చేస్తూ కంకర మిషన్ నడుపుతున్న, పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న కబ్జాకోరులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ గత ఐదేళ్లలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను తలపించారని ఎద్దేవా చేశారు. గడిచిన ఐదేళ్లలో 1.75 లక్షల ఎకరాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారన్నారు. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వం విచారణ చేయిస్తుందన్నారు. అక్రమార్కులు ఎక్కడ దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, కొమ్మినేని గంగయ్యనాయుడు, మహమ్మద్ అలీ, సురేష్‌రెడ్డి, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.





పుట్టపర్తి, ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు

హెల్మెట్ వాడకంపై అవగాహన

పుట్టపర్తి రూరల్, జూలై 18: హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని స్థానిక కోర్టు నుంచి గణేష్ కూడలి వరకు నిర్వహించారు. గురువారం జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి రాకేష్ మాట్లాడుతూ... హెల్మెట్ ధరించకపోవడంతో అనేకమంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాలు జరిగినప్పుడు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, లెక్కల యదుభూషణ్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ఇందిర, నాగేంద్ర, చల్లా రాజశేఖర్, మౌనిక, కోర్టు సూపరింటెండెంట్ బాలాజీనాయక్, క్లర్కు మంజునాథ్, ఎంఎల్‌ఓ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలో మోటారు వాహన చట్టాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు.

కదిరిలీగల్: ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ వాడాలని మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి జయలక్ష్మి సూచించారు. పట్టణంలో ర్యాలీ కోర్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వన్‌కే వాక్ నిర్వహించారు. హెల్మెట్ ధరించడంపై విద్యార్థులు, ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ర్యాలీలో న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, దశరథ పాల్గొన్నారు.



కదిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి జయలక్ష్మి

పంట నష్టపరిహారం ఇవ్వాలి

నంబులపూలకుంట, జూలై 18: మండల వ్యాప్తంగా 2023లో పంటలు సాగుచేసి, నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, నాగరాజు, గంగిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కావున వెంటనే రైతులకు సాయం చేయాలని కోరారు. వారితోపాటు రైతులు విశ్వనాథ్‌రెడ్డి, పాపిరెడ్డి, బాబాఫక్రుద్దీన్, నాగిరెడ్డి, బ్రహ్మాచారి, రవి తదితరులున్నారు.

ధర్మవరంరూరల్: ఖరీఫ్ పంటకాలం ప్రారంభం కావడంతో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు సాగుసాయం కింద రూ.20వేలు రైతుఖాతాలో జమచేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గొట్లూరు, తుమ్మల, పోతుకుంట, కుణుతూరు, చిగిచెర్ల, బడన్నపల్లి గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్‌బీకేల్లో ఆయన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ, మారుతి, హరి, నరసింహులు, ఆదినారాయణ, నరసింహులు, ఓబిలేసు, సంజీవప్ప, ఆంజనేయులు, జగన్, మహబూబ్‌బాషా, తిప్పన్న పాల్గొన్నారు.

తనకల్లు: రైతు రుణ విమోచన చట్టం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు గురువారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడిసాయం రూ.20వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం వీవీ రమణ, శివన్న, వెంకటరమణ, ఒంటెద్దు వేమన్న, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: గాండ్లపెంట కరువు మండలాన్ని ఆదుకోవాలని సీపీఐ నాయకుడు కేకే రాజారెడ్డి సచివాలయంలో వినతిపత్రం అందించారు. గత ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఖాదర్‌బాషా, రైతులు ఉన్నారు.

పంటల పరిశీలన

నల్లమాడ, జూలై 18: మండలంలోని వంకరకుంట, బానపకుంట గ్రామాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంటలను ఏరువాక కేంద్రం పుట్టపర్తి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం. జాన్‌స్న, శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏఓ సుమతి గురువారం పరిశీలించారు. వేరుశనగ ఊడదశలో ఉందని, ఎకరాకు కిలో జిప్సం వాడాలని సూచించారు. పచ్చపురుగు ఆశించడంతో పంట దిగుబడి తగ్గే అవకాశముందని, దీని నివారణకు హస్‌పేట్ 1.50 గ్రా. క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంట 20 నుంచి 25 రోజుల మధ్య 50 కిలోల యూరియాను, 45 నుంచి 50 మధ్యరోజులు 50 కిలోల యూరియా, 60 నుంచి 65 మధ్య ఉన్న పంటకు 50 కిలోల యూరియా వాడాలన్నారు. కత్తెర పురుగు నివారణకు హిమామేస్టిన్‌బేజేట్ 0.30 గ్రా. లేదా ఓరాజిన్ 0.3 గ్రా. లీటర్‌నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

శాశ్వత కులధ్రువీకరణ పత్రాలపై సర్వే

ఓబుళదేవరచెరువు, జూలై 18: శాశ్వత కులధ్రువీకరణ పత్రాలను ఇచ్చేందుకు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పగడ్బందీగా సర్వే చేపట్టేలా చర్యలు చేపడుతున్నట్లు ఆర్డీఓ భాగ్యరేఖ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మండలాలు, గ్రామాల్లో నివాసముంటున్న అన్నికులాలకు చెందిన లబ్ధిదారులకు కులధ్రువీకరణ సర్వే నిర్వహించి శాశ్వత పత్రాలను అందజేస్తామన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, 716 నేషనల్ హైవేకి సంబంధించిన రోడ్డు పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. రైతుల పొలాల్లో వేస్తున్న రోడ్డు నిర్మాణాలకు 80 శాతంపైగా పరిహారం అందించామన్నారు. మిగిలిన 20శాతం కూడా వివిధ కారణాల వలన అలస్యమవుతోందన్నారు. ఆగస్టు నెల నుంచి కొత్త డీలర్లు అందుబాటులోకి వస్తారన్నారు. రేషన్ లబ్ధిదారులకు సకాలంలో చక్కెర, బియ్యం, గోధుములు, నిత్యవసర వస్తువులు అందించాలని సూచించామన్నారు.

సోలార్ భద్రతపై తనిఖీ

నంబులపూలకుంట, జూలై 18: స్థానిక సోలార్ అల్ట్రా మేగా పార్కును ఆక్టోపస్ డీఎస్పీ రాజీరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఎన్‌టీపీసీ, ఏపీఎస్‌డీసీఎల్, ఆయానా, అంధాని, స్ప్రింగ్ ఎనర్జీ కంపెనీల్లో ఉత్పత్తి అయ్యేసౌర విద్యుత్‌ను పరిశీలించారు. పనిచేస్తున్న సిబ్బందిని సోలార్ భద్రతపై ఆరా తీశారు. వెయ్యి మెగా వోల్టల సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఏ వస్తువు కూడా అపహరణకు గురికాకుండా బాధ్యత వహించాలన్నారు. ఆయన వెంట కదిరి డీఎస్పీ శ్రీలత, తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎన్‌టీపీసీ ఏజీఎం రామమోహన్, ఎఫ్ఎస్ఓ మన్సూర్, ఇంటలిజెన్స్ ఎస్ఐ రాము, సీఐ నీలంకఠ, ఎన్పీకుంట ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ముదిగుబ్బ, జూలై 18: మండలంలోని పెద్దచిగుళ్లరేవు గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రైతులు కర్రలతో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏడీ సుబ్రమణ్యం, ఎస్ఈలకు ఫోన్‌లో సూచించారు. దీంతో పీసీరేవు సమీపంలోని రైతుల పొలాల్లో కర్రల స్థానంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన సిబ్బంది

ధర్మవరం, జూలై 18: స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి పిలుపు మేరకు ఏక్ పేడ్ మా కేనామ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని 50 రావి, టేకు, సీతాఫలం, చింత, నేరేడు, జామ, వేప మొక్కలను నాటారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పవతి, సరస్వతి, హైమావతి పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే..

కదిరి అర్బన్, జూలై 18: జర్నలిస్టులపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని, ఆయన భేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందేనని వర్కింగ్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణంలో ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన క్షమాపణ చెప్పకతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు యల్లమరాజు, కదిరి పట్టణ వర్కింగ్ జర్నలిస్టులు అమృతరాజు, సోముశేఖర్, హరియాదవ్, రాము, చలపతి, మాధవ్, హరి, సునీల్, ఫారూక్, సాధిక్, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ఎంపీ విజయసాయిరెడ్డి పాత్రికేయుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో పాత్రికేయులు నిరసన తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.


కదిరిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు


ఓడీసీఓ సీఐకి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

మాతాశిశు మరణాలను అరికట్టాలి: కలెక్టర్



పుట్టపర్తి, జూలై 18 : జిల్లాలో మాతాశిశు మరణాలను పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు టీఎస్ చేతన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జాతీయ ఆరోగ్య మిషన్ డీసీహెచ్ఓ, మలేరియా ఎయిడ్స్ కంట్రోల్‌పై నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా క్రమశిక్ష ణ చర్యలు తప్పవని హెచ్చరించారు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వంద శాతం ప్రసవాలు జరగాలని, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వారానికి రెండు సార్లు ప్రభుత్వ వసతిగృహాల్లో, పాఠశాలల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఓ డాక్టర్ తిప్పేంద్రనాయక్, వైద్యాధికారులు డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ కేసీకే నాయక్, డాక్టర్ నివేదిత పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పెంచండి : కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా చర్యలు చేపట్టి మద్యం గంజాయి మత్తుపదార్థాలను నిర్మూలించాలని కలెక్టరు టీఎస్ చేతన్ అధికారులను ఆదే శించారు. గురువారం కలెక్టరేట్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సెబ్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు కర్ణాటక సరిహద్దు ప్రాంతం అధికంగా ఉందని, అక్రమ మద్యం గంజాయి రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా నాటుసారా తయారీ ఉండరాదన్నారు. అనంతరం కలెక్టరు జిల్లా కేంద్రంలోని ఆర్వీ జానకీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు వెళ్లి తనిఖీ చేశారు. మెనూప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలంటూ ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మను ఆదేశించారు. ఆయన వెంట జేసీ అభిషేక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ విష్ణు, ఎక్సైజ్ అధికారి సహదేవయ్య, విద్యుత్ అధికారులు మోషెష్, శివశంకరరెడ్డి ఉన్నారు.

నేరాలను నియంత్రించండి: ఎస్పీ



ధర్మవరం, జూలై 18: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేకదృష్టి సారించాలని నూతన ఎస్పీ రత్న పోలీసులకు ఆదేశించారు. గురువారం ఆమె స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పరిశీలిం చారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అలాంటి నేరాలకు పాల్పడేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట సీఐ సుబ్రమణ్యం ఉన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయండి: జేసీ



పుట్టపర్తి, జూలై 18: సకాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టరు అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలోని గౌడోన్ల నుంచి ఈనెల 30లోగా చౌకదుకాణాలకు సరుకులు చేరాలన్నారు. బియ్యానికి బదులుగా ఒక కేజీ నాణ్యమైన జొన్నలు, పంపిణీ చేస్తామన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీని తాను తనిఖీ చేస్తానని, ఎలాంటి పొరపాట్లున్నా ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా మండల కేంద్రంలో కందిపప్పు, రెండు రకాల బియ్యాన్ని అమ్మకాలు చేపడుతున్నట్లు జేసీ పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, మేనేజర్ అశ్వర్థనారాయణనాయక్ పాల్గొన్నారు.

శ్వేతపత్రాలతో వైసీపీ నాయకుల్లో భయం: ఎమ్మెల్యే

పుట్టపర్తి, జూలై 18: వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు కూటమి ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేస్తుండటంతో వైసీపీ నాయకులు వెన్నుల్లో వణుకు పుడుతోందంటూ స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లక్షల ఎకరాలు భూములను కబ్జా చేశారని, ఇళ్లపట్టాల పేరుతో అనుచరులకు ఎకరాల ఎకరాలు భూమిని పంచారని, ఇసుక దందాతో రూ.వేల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. వైసీపీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను లీజ్ పేరుతో అతి తక్కువ ధరకు కొట్టేశారన్నారు. వీటన్నింటిపై శ్వేత పత్రాలను విడుదల చేస్తుండటంతో ఆ పార్టీ వర్గాలలో వణుకు పుడుతోందన్నారు. అక్రమాలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

టీడీపీ నేత తల్లి మృతికి నివాళి

ఓబుళదేవరచెరువు, జూలై 18: మండలంలోని దిగువపల్లిలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి అంజినప్ప తల్లి సాలేమ్మ గురువారం అనారోగ్యంతో మృతిచెందింది. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. చల్లవాండ్లపల్లి, నవాబుకోట తదితర గ్రామాల్లో మాజీ మంత్రి పలు టీడీపీ కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, జెరిపిటి ఆంజనప్ప, ఆర్ఎంపీ జాకీర్, ఐటీడీపీ షానవాజ్, బడిశం రామాంజి, ఇ. ఆంజనేయులు, గంగాద్రి, గంగాధర్, చెండ్రాయుడు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ధర్మవరం, జూలై 18: న్యాయవాదుల డిమాండ్ల సాధనలో భాగంగా మూడు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్టు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణంలోని బార్‌అసోషియేషన్ చాంబర్‌లో నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపీ) మంజూరు కోసం రూపొందించిన నిబంధనలను సరికాదన్నారు. బార్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా న్యాయవాదుల మనోభావాలను భంగం వాటిల్లేలా వ్యవహరిస్తోందన్నారు. సీఓపీ నిబంధనలను 2024లో బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలు న్యాయవాదులకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. రెన్యువల్ చేసుకోవడానికి దరఖాస్తు రుసుం రూ.500 పెంచడం సరికాదన్నారు. ఈ సమావేశంలో బార్ అసోషియేషన్ కార్యదర్శి గోపీక్రిష్ణ, కోశాధికారి అబ్దుల్‌సాబ్, ఉపాధ్యక్షుడు కరీం, న్యాయవాదులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

తనకల్లు, జూలై 18: మండల వ్యాప్తంగా రైతులు ఉపాధి పథకం కింద పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఓ మరియమ్మ కోరారు. మామిడి, చీని, నిమ్మ, జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరెడు, చింత, రెగు, జీడిమామిడి. తైవాన్ జామ, డ్రాగ్ ఫ్రూట్, మల్లె, గులాజి, మునగ, మల్టిక్రాపింగ్ పంటల సాగుకోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి ఉండి, సన్న, చిన్నకారు రైతులు అర్హులని, బ్యాంక్‌ఖాతా, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, వన్‌బి ఒర్జినల్, చిన్న సన్నకారు రైతు సర్టిఫికెట్లతో ఆయా గ్రామాల్లోని ఉపాధి హామీ క్షేత్ర సాంకేతిక సిబ్బందికి లేదా.. ఎంపీడీఓ కార్యాలయంలో.. దరఖాస్తులు అందించాలన్నారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ ప్రారంభం

ధర్మవరం, జూలై 18: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరాన్ని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఈ శిక్షణ నెలాఖరు వరకు ఉంటుందని, స్పెయిన్ దేశానికి అంతర్జాతీయ బాస్కెట్ బాల్ కోచ్‌లు మౌర్, ఒరియోల్, నటాలియా, పోల్ ఈ శిక్షణ ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని భవిష్యత్తులో అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. గతంలో స్పెయిన్ కోచ్‌లు ఇచ్చిన శిక్షణతో అనేక మంది జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రాణించారన్నారు. అనంతరం స్పెయిన్ బృందం క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేశారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్టు సభ్యులు జస్వంత్, హరిజిత్, ప్రణవ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

ముదిగుబ్బ,జూలై 18: స్థానిక గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు ఈ నెల 22వ తేదీ నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి మంజులకు పలు డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీస్ అందజేశారు. పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు సబ్బులు, గ్లౌజ్‌లు మాస్కులు ప్రతినెలా అందించాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆదెప్ప, ఓబిలేసు, సావిత్రి పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు బకాయిలు చెల్లించాలి

తనకల్లు, జూలై 18: పెండింగ్‌లో ఉన్న ఎల్‌సీడీసీ సర్వే నిధులను వెంటనే ఆశకార్య కర్తలకు చెల్లించాలని ఆశవర్కర్ల యూనియన్ నాయకులు కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. 2021, 22, 23 సంవత్సరాలకు సంబంధించి ఆశకార్యకర్తలు సర్వే చేశారని, సర్వేనిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఒంటెద్దు వేమన్న, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ఉచిత వైద్యసేవలు

పుట్టపర్తి, జూలై 18: విదేశీభక్తులు సత్యసాయిబాబా చూపిన సేవామార్గంలో వైద్యసేవలందించడానికి ప్రశాంతినిలయానికి చేరుకున్నారు. 70 మంది వైద్యుల బృందంతో గురువారం ప్రశాంతినిలయంలోని ఉత్తరభవనం-1 దగ్గర వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. మొదట సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జేరత్నాకర్ ఈ వైద్యశిబిరాన్ని ప్రారంబించారు. సత్యసాయి చూపిన సేవాబాటలో పయనిస్తూ వైద్యసేవలందించడంలో సత్యసాయి భక్తులు ఎప్పుడు ముందుంటారన్నారు. ఈనెల 22 వరకు ఐదు రోజులపాటు అన్నిరకాల రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందచేస్తారన్నారు. కార్యక్రమంలో సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, కో-ఆర్డినేట్ కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేష్ అధ్యక్షుడు లక్ష్మణరావు, గ్లోబల్ కౌన్సిల్ మెడికల్ మెంబర్లు డాక్టర్ గీతా, డాక్టర్ రాంమనోహర్‌రావు, జనరల్ హాస్పిటల్ డైరక్టర్ నరసింహా రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్జే రత్నాకర్

గుంతపల్లి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోరంట్ల, జూలై 18: తొలి ఏకాదశి వేడుకల సందర్భంగా మండలంలోని గుంతపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పండుగను పంచాయతీ పరిధిలో ని గ్రామాల వారు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. రెండో రోజు గురువారం అర్చకులు సుధాకర్, మంజు, హరిస్వాములు లక్ష్మీసమేత నరసింహస్వామికి అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు చేశారు. శుక్రవారం ఎద్దులబండ్ల ప్రదర్శన, ఉట్లపరుష నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆలయ ధర్మకర్త నర్సిరెడ్డి కోరారు.

ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవం


జ్యోతులు మోసుకెళ్తున్న మహిళలు

పెనుకొండ రూరల్, జూలై 18: తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వెంకటరెడ్డిపల్లి ఆంజనేయస్వామికి జ్యోతుల మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా ఆనవాయితీ ప్రకారం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి తొలి ఏకాదశి మరుసటిరోజు స్వామివారికి జ్యోతులు సమర్పిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేపట్టారు.

ముగిసిన వేడుకలు

అగళి, జూలై 18 : మండలంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తొలి ఏకాదశి వేడుకలు గురువారం ముగిశాయి. వేడుకల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణీపాండురంగస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రెండోరోజు భూతప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వీధివీధినా భూతప్పలను ఊరేగించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోసి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

హిందూపురం అర్బన్, జూలై18: నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యువతకు ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నాక్ ఏడీ గోవిందరాజులు గురువారం ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న ఉయవకులు ఈనెల 23లోగా ఆధార్, రేషన్‌కార్డు, అర్హత ధ్రువపత్రాలతో పాటు పాస్‌ఫోర్టు సైజు ఫోటోలతో ముక్కిడిపేటలోని పాత ఎస్సీ బాయ్స్ హాస్టల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9052901657, 9110550779 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

హిందూపురం(పరిగి), జూలై 18 : రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ చేపట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదును ఆపార్టీ పరిగి మండలనాయకులు గురువారం సాయంత్రం ప్రారంభించారు. జనసేన పార్టీ పరిగి మండల నాయకుడు నాగేష్ పలువురు జనసేన కార్యకర్తలతో క్రియాశీలక సభ్యత్వ నమోదు చేయించారు. దాని ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నరసింహ, విజయ్, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

పెనుకొండ, జూలై 18: పట్టణంలోని ఒకటో గ్రామ సచివాలయం పరిధిలో డెంగీ వ్యాధి సోకిన వ్యక్తిని డీఎంహెచ్ఓ మంజువాణి సందర్శించారు. వ్యాధి సోకిన వ్యక్తి ఇంటికి వెళ్లి ఆయన రిపోర్ట్‌ను పరిశీలించారు. వ్యాధి సోకకుండా ఉండేం దుకు కొబ్బరి చిప్పల్లో, పాత గిన్నెల్లో, నీటి తొట్టెల్లో, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు చుట్టుపక్కల ప్రబలకుండా సర్వేచేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఫాగింగ్ చేయాల్సిందిగా మునిసిపల్ సిబ్బందికి తెలపాలన్నారు. వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అర్బన్ వైద్యాధికారి సౌమ్య, ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్‌రావు, హేమ, సుధాకర్, ఎఎన్ఎం ఉమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి

ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, జూలై 18: యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఎస్ఎఫ్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వాటిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, జైచంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

గోరంట్ల, జూలై 18: పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త దామోదర్ (35) మృతిచెందడంతో మాజీ ఎంపీటీసీ నిమ్మల యువశేఖర్ నివాళులర్పించారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న నిమ్మల యువశేఖర్ అనుచరులతో వారిఇంటికెళ్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయనతోపాటు నాయకులు వృషభదేవుడు, అగిశం భరత్‌కుమార్, తిరుమలేష్, శంకర్, బాలాజీ, మల్లికార్జున తదితరులున్నారు.

అగ్నిగుండంలో పడి వ్యక్తికి గాయాలు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 18: సోమందేపల్లి మండల పరిధిలోని నడింపల్లిలో పీర్లచావిడివద్ద బుధవారం అర్ధరాత్రి అగ్నిగుండంలో ప్రమాదవశాత్తు జారిపడి వెంకటేశ్ అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. పరిగి మండలం గొర్రెపల్లికి చెందిన వెంకటేశ్ పీర్లపండగ కోసం నడింపల్లిలోని అత్తారింటికి వచ్చాడు. అగ్నిగుండంలో ఉన్న మొద్దలను తీయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. వెంటనే గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

గోరంట్ల, జూలై 18: మండలంలోని పాలసముద్రం సమీపంలో కుబేరా హిల్స్ వద్ద గురువారం గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొని నరసింహులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బెల్లాచెరువు గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏకాదశి సందర్భంగా గురువారం సాయంత్రం ఎద్దులబండ్లు, జ్యోతు ప్రదర్శన నిర్వహించారు. టి రాగిమేకలపల్లికి చెందిన నడిపన్నగారి నరసింహులు ఈ వేడుకలకు వెళ్లి, తిరిగి గ్రామానికి నడుచుకుని వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నరసింహులు తలకు బలమైన గాయమైంది. ద్విచక్ర వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. అతడిని 108లో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హిందూపురం తరలించారు.

తొలి ఏకాదశి వేడుకలు

- రెండోరోజు ఆకట్టుకున్న ఉట్లపరుష
- పూజల్లో పాల్గొన్న మంత్రి సవిత



పెనుకొండలో పూజల్లో పాల్గొన్న మంత్రి సవిత, ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

పెనుకొండ, జూలై 18: పట్టణంలోని చెరువురోడ్డు సమీపంలో కొండపై వెలసిన ఘనగిరి గర్భ ఆంజనేయస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామికి గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయ సమీపంలో సాయంత్రం నిర్వహించిన ఉట్లపరుష భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఉట్లమాను ఎక్కడానికి యువ కులు పోటీ పడ్డారు. చివరకు మహేష్ అనే యువకుడు ఉట్లమాను ఎక్కి విజేతగా నిలి చాడు. సాయంత్రం జరిగిన కార్యక్రమాలకు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె కు ఆలయ కమిటీ సభ్యులు, భోగసముద్రం జలవనసంరక్షణ సభ్యులు, ఆర్యవైశ్య సభ్యులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆ మె పేరిట అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను ఆమె సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశులు, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, మాధవనాయుడు, త్రివేంద్రనాయుడు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదవినియోగం చేశారు.


బారెడ్డిపల్లి వద్ద ఉట్లమాను ఎక్కుతున్న యువత

హిందూపురం(పరిగి) : ప్రతి యేటా మాదిరిగానే తొలి ఏకాదశి వేడుకల సందర్భంగా పరిగి మండలంలోని బారెడ్డిపల్లి వద్ద పెన్నా నదితీరంలో గురువారం ఉట్లపరుషను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎద్దఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు నరసింహా రెడ్డి, జయసింహారెడ్డి, నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(సోమందేపల్లి) : సోమందేపల్లి మండలంలోని చల్లాపల్లి సమీపంలో వెలసిన కదిరేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గురువారం సాయంత్రం ఉట్లపరుషను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని తిలకించారు. మాజీ జడ్పీ టీసీ వెంకటరమణ, రామక్రిష్ణ, శరత్‌చంద్రా రెడ్డి, మధు, సిద్దలింగప్ప, సూరి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కుమారుడు సాయి ఆలయంలో ప్రత్యేక పూజ లు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మండల సమావేశం.. కాలక్షేపానికా?

అధికారులపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, జూలై 18: మండల సాధారణ సర్వసభ్య సమావేశం అంటే కాలక్షేపానికి అనుకుంటున్నారా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఘాటుగా ప్రశ్నించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారులు సమగ్రమైన నివేదికతో రాకపోవడంతో పాటు పలువురు అధికారులు డుమ్మా కొట్టడం పట్ల ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను సభ్యులు సభ దృష్టికి తెచ్చి వాటి పరిష్కారం కోసం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారని, అలాంటి సమావేశాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటన్నారు. అలాగే ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకే నిర్వహించే ఇలాంటి సమావేశాల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. మండలం సమావేశంలో సభ దృష్టికి వచ్చే సమస్యలను వచ్చే సమావేశంలోగా 80 శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండలంలో లోటవోల్టేజీ సమస్య అధికంగా ఉందని విద్యుత్ శాఖ మంత్రిని, జిల్లా విద్యుత్ శాఖాధికారిని తాను కలిశానన్నారు. గత ఐదేళ్లలో రైతులు దరఖాస్తు చేసుకొన్న వెయ్యి వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని, 412 ట్రాన్స్‌ఫార్మర్‌లు అవసరం అవుతాయని కోరగా వారు అందుకు సానుకూలంగా స్పందించారన్నారు. వాటిని అమలు చేయడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా ఖరీఫ్ సాగులో తెగుళ్ల నివారణకు, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్ డిపార్ట్‌మెంట్‌లో మాయమైన పదివేల బస్తాల సిమెంటు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వచ్చే సమావేశంలోగా అధికారులు నిర్లక్ష్యం విడనాడి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఓ ఆరాధ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం

రూ.20 వేలు అందించాలి : రైతు సంఘం

హిందూపురం అర్బన్, జూలై 18: పంటలు పండించే ప్రతి రైతుకు ప్రభుత్వం పెట్టుబడి సాయంగా రూ. 20వేలు అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో చేతికందక చాలామంది రైతులు నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రైతులకు మద్దతుగా సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, నాయకులు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడి ఆత్మహత్య

లేపాక్షి, జూలై 18 : క్యాన్సర్ బారినపడిన ఆజాద్ అహ్మద్(40)అనే వ్యక్తి మండలంలోని చోళసముద్రంలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. హిందూపురం పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన ఆజాద్‌అహ్మద్ కొంతకాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. పలుచోట్ల చూపించినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తిచెంది చోళసముద్రం శివారుప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగినా పశువుల కాపరులు గురువారం గమనించి సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మహబూబ్‌బాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... ఒకరి మృతి

ఇద్దరికి గాయాలు

గోరంట్ల, జూలై 18: మండలంలోని హిందూపురం ప్రధాన రహదారి గ్రేట్ వే విల్లాస్ సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటనలో కిషోర్(36) మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. కియ అనుబంధ పరిశమలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు ద్విచక్రవాహనంలో వెళుతుండగా గ్రేట్వే విల్లాస్ సమీపంలో రాత్రి పది గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. గోరంట్ల ఖండలం మందలపల్లికి చెందిన కిషోర్ అక్కడికక్కడే మృతిచెందాడు. హిందూపురం మండలం గుడ్డంపల్లికి చెందిన శివారెడ్డి, సోమందేపల్లి మండలం కూటిమానిపల్లికి చెందిన భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. పాలసముద్రం సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమలో వీరు ముగ్గురు పనిచేస్తున్నారు. ముగ్గురూ స్నేహితులు కావడంతో ఏకాదశి సందర్భంగా భాస్కర్ ఆహ్వానం మేరకు కూటిమానిపల్లికి బయలుదేరి వెళుతున్నారు. కంపెనీలో విధులు ముగించుకుని ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురూ కలిసి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న వారిని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. గాయపడ్డవారిని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇంకా భ్రమలో ఉన్న విజయసాయిరెడ్డి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూలై 18: అధికారం కోల్పోయినా... ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమలో విజయసాయిరెడ్డి బతుకుతున్నారని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ఎద్దేవా చేశారు. మీడియా సమావేశంలో మీడియా ప్రతినిధుల పట్ల బెదిరింపు ధోరణిలో మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమ న్నారు. ఎమ్మెల్యే గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ... అంత నీతి నిజాయితీ కలిగిన విజయసాయిరెడ్డి సాక్షాత్తు ఆ మహిళ భర్తే డీఎన్ఏ టెస్టుకు డిమాండ్ చేస్తే ఎందుకు వెళ్లలేదన్నారు. తప్పు చేశానని భయపడుతున్నారా అని ప్రశ్నించారు. మీడియా ఛానల్ పెడతానంటూ బెదిరిస్తున్నారా అని విజయసాయిరెడ్డిని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు మీ దౌర్జన్యాలకు ఎదురొడ్డి ప్రజా సమస్యలను బలంగా చాటిన వాటి యాజమాన్యాలు మీ తాటాకుచప్పుళ్లకు భయపడరన్నారు. సాక్షాత్తు ఒక మహిళ భర్త తనకు జరిగిన అ న్యాయాన్ని బయటకు వచ్చి చెప్పినా మొండిగా వ్యవహరించడం నీ అహం కార ధోరణికి నిదర్శనం అన్నారు. గత వైసీపీ పాలనలో మీరు, మీ పార్టీ కబ్జాదారుల అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి ప్రస్తుత ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, సాధికారత కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మాజీ సర్పంచి చంద్రప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

విజయసాయిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

: పాత్రికేయులు

మడకశిర(అమరాపురం), జూలై 18: పాత్రికేయులను అసభ్య పదజాలంతో దూషించిన ఎంపీ విజయసాయిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని అమరాపురం మండల పాత్రికేయులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

నేడు అమరాపురానికి ఎమ్మెల్యే రాక

మడకశిర(అమరాపురం), జూలై 18: అమరాపురం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొంటున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికంగా హాజరై పార్టీ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బావిలో పడిన వృద్ధుడు..

హిందూపురం అర్బన్, జూలై 18: పట్టణ పరిధిలోని సీపీఐ కాలనీలో ఉన్న పాడుబడిన బావిలో ఓ వృద్ధుడు ప్రమాద వశాత్తు పడిపోయాడు. పట్టంలోని వాల్మీకి సర్కిల్ ప్రాంతానికి చెందిన కొండప్ప కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాద వశాత్తు పక్కనే ఉన్న పాడుబడిన బావిలో పడిపోయాడు. అందులో నీరు లేదు కానీ, దాదాపు 40 అడుగుల లోతు ఉంటుందని ఫైర్ సిబ్బంది తెలిపారు. కొండప్ప కేకలు వేయడంతో గమనించిన స్థానిక ప్రజలు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి అతడిని బావిలో నుంచి పైకి తీసి కాపాడారు. అయితే చిన్న గాయాలు అయ్యాయని ప్రమాదం తప్పిందని తెలిపారు.

హెల్మెట్ ధరించి... ప్రాణాలను రక్షించుకోండి

న్యాయాధికారి అశోక్‌కుమార్



ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి

మడకశిరటౌన్, జూలై 18: ద్విచక్ర వాహనాలను నడిపే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్‌లను ధరించి, ప్రాణాలను పరిరక్షించుకోవాలని మడకశిర జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్ అశోక్‌కుమార్ అన్నారు. మడకశిర పట్టణంలో గురువారం అర్బన్ సీఐ మనోహర్, రూరల్‌సీఐ రాజ్‌కుమార్, న్యాయవాదులతో కలిసి న్యాయాధికారి అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణం నుంచి అమరాపురం బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ... హెల్మెట్‌ను ధరించి, ప్రాణాలను పరిరక్షించుకోవడంతో పాటు కుటుంబాన్ని కాపాడుకోవాలని సూచిం చారు. వాహనం నడిపే వ్యక్తి ప్రతి తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతోపాటు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కిష్టప్ప, గోపీనాథ్, బాబునాయక్, కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ, కోర్టు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మంత్రికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల వినతి

పెనుకొండ రూరల్, జూలై 18: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సం ఘం నాయకులు మంత్రి సవితను కోరారు. బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖమంత్రి సవిత గురువారం రొద్దం మండలంలో పర్యటించారు. అక్కడికి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తదితర నాయకులు చేరుకుని మంత్రి సవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 350 మండలాల్లో 30లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. 2024 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు వెంటనే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమచేయాలని కోరారు. ఉపాధిహామీల్లో పనిచేసే కూలీలకు 200పనిదినాలు పెంచాలని పెండింగ్‌లో ఉన్న బిల్లు లు మంజూరు చేయాలని కోరారు.

పింఛన్ ఇప్పించండి..


బాధితుడు చరణ్‌ను పరామర్శిస్తున్న మంత్రి సవిత

హిందూపురం (సోమందేపల్లి), జూలై 18 : నరాలవ్యాధితో బాధపడుతున్న తమ కుమారుడు చరణ్‌కు పింఛన్ ఇప్పించాలని మండలకేంద్రమైన సోమందేపల్లిలో గీతానగర్‌కు చెందిన శివశంకర్, దివ్యశ్రీ గురువారం మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమకు చరణ్ ఒక్కడే సంతానమని, అతడు ఏడేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. చికిత్స కోసం చేయని ప్రయత్నం లేదన్నారు. పూర్తిగా కాళ్లు చచ్చుబడి మంచానికే పరిమితమైన తమ కుమారుడికి వికలాంగ పింఛన్ ఇప్పించాలని వారు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే డీఎంహెచ్ఓతో ఫోన్ ద్వారా మాట్లాడి, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

పెనుకొండ రూరల్, జూలై 18: బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత గురు వారం రొద్దం మండలంలోని పెద్దకోడి పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తనను కలిసేందుకు వచ్చిన వారంతా బొకేలు, శాలువాలకు బదులుగా నోటుపుస్తకాలు, పెన్నులు అందివ్వాలని పిలుపునిచ్చారు.

డప్పు కళాకారుడిపై దాడి


గాయపడిన నాగరాజు

పావగడ, జూలై 18: తాలూకాలోని తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అప్పాజిహళ్లిలో బుధవారం రాత్రి తనపై అదే గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషిస్తూ దాడిచేసి గాయ పరిచారని గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి తెలిపాడు. బాధితుడు నాగరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొలి ఏకాదశి సంద ర్భంగా బుధవారం అదే గ్రామంలో డప్పు వాయించడానికి ఓ ఇంటివద్దకు తనతోపాటు మరికొం దరు వెళ్తుండగా.... తమ కులదైవం వీరజిన్నయ్యకు డప్పు వాయించాలని ఓ సామాజిక వర్గానికి చెందిన కొందరు తమను అడ్డుకున్నారన్నారు. అయితే వారితో డబ్బుతీసుకున్నందున వారి కార్యక్రమం అనంతరం మీకు వస్తామనడంతో వారు వినకుండా.... తమ చేతిలో ఉన్న డప్పులను పగలకొట్టి తమపై కట్టెలు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారన్నారు. అంతేకాకుండా తన భార్య హేమలతను భయపెట్టారన్నాడు. తమపై నీ భర్త పోలీసులకు ఫిర్యాదు చేస్తే మిమ్మల్ని శాశ్వతం గా ఊరి నుంచి బహిష్కరిస్తామని, మీ కుటుంబాలను సమాధి చేస్తామని బెదిరించారని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ.... తనపై దాడికి పాల్పడిన వెంకటరమణ, పరమేశ్, పవన్, చంద్ర, మహేంద్ర, రవి అనే వ్యక్తులపై తిరుమణి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

21న యల్లమ్మ దేవతకు బోనాలు

హిందూపురం అర్బన్, జూలై 18: పట్టణ పరిధిలోని నింకంపలి రోడ్డులో వెలసిన యల్లమ్మ దేవతకు ఈ నెల 21వ తేదీ ఆదివారం గురుపౌర్ణమి రోజు బోనాల జాతర చేపట్టనున్నట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12లోగా బోనాల జాతర ఉంటుందన్నారు. సాయంత్రం 6.30కు కుసుమ మహిళా మండలి ఆధ్వర్యంలో భజనలు, ప్రాకారోత్సవం ఉంటాయన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావలెనని కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జాతర


పాలకడవలతో వస్తున్న పూజారుల వెంట భక్తులు

పావగడ, జూలై 18 : తా లూకాలోని దాదాపు 15గ్రా మాల ఇలవేల్పుగా కొలిచే లక్ష్మీ నరసింహ స్వా మి జాతర మ హోత్సవాన్ని ఆ షాఢ ద్వాదశి రోజైన గురువారం మీనకుంటపల్లిలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఎద్దులబండ్లను, గొర్రెలు, మేకలను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. రాంపేట గ్రామం నుంచి పాలకడవలతో పూజారులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా... మహిళలు జ్యోతులు మోస్తూ వారిని అనుసరించారు. ప్రదక్షిణల అనంతరం పాలకడవలతో స్వామివారి విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించా భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. దాదాపు 15గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మహోత్సవానికి తరలిరండి

పావగడ, జూలై 18 : చిత్రదుర్గంలో జరిగే ఈనెల 20న సిద్దరామేశ్వర మహాసంస్థానం భూవి గురుపీఠం అధ్యక్షుడు ఇమ్మడి సిద్దరామేశ్వరస్వామి దీక్షారంజిత మహోత్సవానికి పావగడ నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని భూవిసంఘం తాలూకా అధ్యక్షుడు బంగారప్ప తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఐబీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.శనివారం ఉదయం 10గంటలకు పావగడ నుంచి ప్రతి గ్రామం నుంచి బస్సు సౌకర్యం కల్పించడంతో భూవి కులబంధవులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు.

ఘనంగా లక్కమ్మ, చిత్రలింగేశ్వరస్వామి ఉత్సవం


ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు

గుడిబండ, జూలై 18 : మండలంలోని కొంకల్లు, ఎస్ఎస్‌గుండ్లు గ్రామాల్లో వెలసిన లక్కమ్మదేవి, చిత్ర లింగేశ్వరస్వామి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ గుండ్లలో గురువారం చిత్రలింగే శ్వరస్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి కొంకల్లు గ్రామానికి తీసుకెళ్లి ఉత్సవం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవ కార్యక్రమాన్ని 14ఏళ్ల తరువాత నిర్వహించినట్లు ఆయా గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు.